

శనివారం, 8 మార్చి, 2025

వనితా.. వందనం

తల్లిగా బిడ్డను కంటికి రెప్పలా కాపాడుతోంది.. మమతానురాగాలకు చిరునామాగా నిలుస్తోంది.. తోబుట్టువుగా ప్రేమను పంచుతోంది.. ఆలిగా మగవాడి బతుకులో సగపాలు తనదిగా కష్టసుఖాల్లో తోడూనీడగా ఉంటోంది.. ప్రతి పురుషుడి విజయం వెనుక 'ఆమె' కీలకపాత్ర పోషిస్తోంది.. ఇంటికి దీపం ఇల్లాలుగా కుటుంబానికి వెలుగులు పంచుతోంది.. సేవకు ప్రతిరూపంగా నిలుస్తోంది.. ఒకవైపు వంటింట్లో గరిటె తిప్పుతూనే మరోవైపు రాజకీయాలు, పాలనలోనూ 'చక్రం' తిప్పుతోంది.. ఒకప్పుడు గృహిణులుగానే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో 'రాణి'స్తున్నారు.. ఆకాశంలో సగం కాదు అన్నింట్లోనూ ముందే అని నిరూపిస్తున్నారు.. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు..

న్యూస్‌రీల్

వెయిట్‌లిఫ్టర్ అంజలికి సన్మానం



గుత్తా జ్వాల, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అంజలి

కుల్కచర్ల: వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్న అంతారం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి నీరటి అంజలిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తాజ్వాల అంజలికి ప్రశంసా పత్రం అందజేసి, సన్మానించారు. ఇటీవల తెలంగాణలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో అంజలి రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

భూ నిర్వాసితులకు చెక్కులు



చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: ప్రభుత్వం అందజేసిన నష్ట పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ రైతులకు సూచించారు. దుద్యాల మండలం హకీంపేటకు చెందిన భూ నిర్వాసితులకు మంజూరైన చెక్కులను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, దుద్యాల తహసీల్దార్ కిషన్‌తో కలిసి శుక్రవారం తన కార్యాలయంలో బాధితులకు అందజేశారు.

సీఎమ్మార్ అప్పగింతలో నిర్లక్ష్యం తగదు



మిల్లులో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి: సీఎమ్మార్ బియ్యం అప్పగించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. పరిగిలోని న్యూ ఇండియన్ రైస్ మిల్లు శ్రీశివకృష్ణ రైస్ మిల్లులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సకాలంలో బియ్యం అందించి సహకరించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్‌ఓ మోహన్‌బాబు, డీఎస్‌సీఎం వెంకటేశ్వర్లు, సంతోష్, విజయ్ తదితరులు ఉన్నారు.

పత్తి దిగుబడి పెంచాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి



రైతు సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి

తాండూరు టౌన్: పత్తి అధిక సాంద్రతతో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఏఓ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లుగా పత్తి దిగుబడి నిలకడగా ఉందని.. ఇది పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అధిక సాంద్రతలో పత్తిని సాగుచేయడం వల్ల పంట కాలం తగ్గించుకోవచ్చన్నారు. రెండో పంటగా పెసర, మినుములు వేసుకుని రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఏరువాక కో–ఆర్డినేటర్ టి.లక్ష్మణ్, ప్రధాన శాస్త్రవేత్త కె.పరిమళ, శాస్త్రవేత్తలు సునీత, సుజాత, శేఖర్ మాట్లాడుతూ.. వివిధ పంటల్లో కొత్తగా విడుదలైన వంగడాలపై రైతులు అవగాహన ఉండాలన్నారు. తేనెటీగల పెంపకాన్ని చేపట్టి అధిక లాభాలను పొందవచ్చన్నారు. జొన్న పంటలో యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. పంటల్లో కలుపు మొక్కల యాజమాన్యం, వాటిని తొలగించుటలో కలుపు మందు పిచికారీపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఆర్సీ విస్తరణ సలహా మండలి సభ్యులు ద్యావరి నారాయణ, వ్యవసాయాధికారులు కిషోర్, రత్నమాల, కేశవ కృష్ణ పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. వైద్యురాలిగా



ఆస్పత్రిలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ రేవతిరెడ్డి

శంకర్‌పల్లి: పుట్టుకతో అంగవైకల్యం ఉన్నప్పటికీ డాక్టర్ కావాలనుకునే లక్ష్యాన్ని సాధించానని అంటున్నారు శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రేవతిరెడ్డి. అమ్మానాన్నలు రేయింబవళ్లు కష్టపడ్డారని.. తాను, తన అక్క కలలు కన్న లక్ష్యాల కోసం నిరంతరం తాపత్రయ పడ్డారని చెబుతున్నారు. ఫీజు కట్టడానికి డబ్బు ల్లేక నమ్ముకున్న పొలం సైతం అమ్మేసి చదివించారని తెలిపారు.

చదువులో చురుగ్గా..

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం దేవరంపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, సరళ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు మాధవి రెడ్డి, చిన్న కూతురు రేవతి రెడ్డి. వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. చిన్న కూతురు రేవతిరెడ్డికి చిన్నతనం నుంచే అంగవైకల్యం ఉన్నప్పటికీ చదువులో చురుగ్గా ఉండేది. గమనించిన తండ్రి ఆమెను వెన్నుతట్టి ప్రోత్సహించాడు. శంకర్‌పల్లి పట్టణంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో 7వ తరగతి వరకు తర్వాత 10వ తరగతి వరకు వికారాబాద్ ఎన్నేపల్లిలోని సంఘం లక్ష్మీబాయి రెసిడెన్షియల్ పాఠశాలలో, తర్వాత ఇంటర్ వరంగల్ హసన్‌పర్తిలోని ఏపీఆర్‌జేసీలో చదువుకుంది. ఎంబీబీఎస్‌లో దివ్యాంగుల కోటాలో సీటు రాకపోవడంతో ఓపేన్ ఎ క్యాటగిరీలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని మెడికల్ కాలేజీలో సీటు సాధించింది.

ఖర్చుల కోసం పొలం అమ్మేసి

కూతురికి ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో తండ్రి ఎంతో సంతోషించాడు. ఎంత కష్టమైనా చదవించాలనుకున్నాడు. పెద్ద కూతురు ఎంఎస్సీ, చిన్న కూతురు ఎంబీబీఎస్ కోసం సంవత్సరానికి రూ.లక్షల్లో ఖర్చవుతుండడంతో ఊర్లోని ఆరు ఎకరాల పొలం అమ్మి చదివించాడు. 2008లో పెద్ద కూతురు మాధవిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించగా.. 2014లో రేవతిరెడ్డి ఎంబీబీఎస్ పూర్తి చేసింది. 2014 నుంచి 15 వరకు కోస్గి, 2015–18 నవాబ్‌పేట్, ప్రస్తుతం శంకర్‌పల్లి పీహెచ్‌సీల్లో వైద్యురాలిగా సేవలందిస్తోంది.

ప్రభుత్వం నుంచి అవార్డులు

రేవతిరెడ్డి ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు బాసటగా నిలుస్తోంది. అనేక మందికి ప్రాథమిక దశలోనే రుగ్మతలను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే కాకుండా, నిరంతరం పర్యవేక్షిస్తోంది. నిత్యం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవం గురించి, ఇంట్లో చేయాల్సిన వ్యాయామాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. రేవతిరెడ్డి చేస్తున్న వైద్య సేవలను గుర్తించి 2023లో కలెక్టర్ ఉత్తమ వైద్యురాలి అవార్డుకి ఎంపిక చేశారు. జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ వారు సాధారణ ప్రసవాలు, ఉత్తమ సేవలకు గాను రెండు సార్లు అవార్డులు అందించారు. డాక్టర్ రేవతిరెడ్డికి 2017లో పాండురంగారెడ్డి అనే వ్యక్తితో వివాహం జరిగింది. ఆరేళ్ల పాప, మూడేళ్ల బాబు ఉన్నాడు. తండ్రి వెంకట్‌రెడ్డి 2020లో గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న తల్లి సంరక్షణను అక్కాచెల్లెళ్లు చూసుకుంటున్నారు.

ఓడిపోయిన వైకల్యం



డీఏఓ గోవిందమ్మ

అనంతగిరి: వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వహిస్తున్న గోవిందమ్మ దివ్యాంగురాలు.. పుట్టినిల్లు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గిరిగేట్‌పల్లి గ్రామం. అత్తారిల్లు కుల్కచర్ల మండలం ఘనాపూర్. చిన్నప్పుడే పోలియో బారిన పడింది. కానీ అధైర్య పడలేదు. హైదరాబాద్‌లోని వికలాంగుల స్కూల్‌లో చదువుకుంది. 2002లో జూనియర్ అసిస్టెంట్‌గా రెవెన్యూ శాఖలో ఉద్యోగం సాధించి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ కార్యాలయంలో టైపిస్టుగా జాయిన్ అయ్యింది. ప్రమోషన్‌పై పరిగి గిర్దావర్‌గా, దోమలో డీటీగా, తహసీల్దార్‌గా యాలాలలో పనిచేసి ప్రస్తుతం ఆర్‌డీఓ కార్యాలయంలో డీఏఓగా బాధ్యతలు నిర్వహిస్తోంది. చదువుకు పేదరికం, అంగవైకల్యం అడ్డుకాదని చెబుతోంది. మనం కష్టపడి ముందుకు సాగితే విజయం తప్పకుండా వరిస్తుందని అంటోంది. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని యువతకు సూచిస్తోంది.

తగ్గేదేలె



జాతీయ స్థాయి ట్రిపుల్ జంప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిన సంతోషి(ఫైల్)



జాతీయ స్థాయి హైజంప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన నవనీత(ఫైల్)

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన సంతోషి కుమారి గృహిణి. నవనీత ఓ ప్రైవేటు స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తోంది. వీరు చిన్నతనంలో నేర్చుకున్న ఆటల్ని, ఇష్టాన్ని వదులుకోలేక పోయారు. ఈ ఏడాది జనవరి నెల 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 45 – 50 ఏళ్ల విభాగంలో 48 ఏళ్ల వయసున్న సంతోషి లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. నవనీత 35–40 ఏళ్ల విభాగంలో హైజంప్‌లో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్, ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సంతోషి ట్రిపుల్ జంప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించగా, నవనీత హైజంప్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. త్వరలో ఇండోనేషియాలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నవనీత పాల్గొననున్నారు.

అధికారులను నిర్బంధించి.. రోడ్డు సాధించి



సంఘాల చైతన్యంతో గ్రామానికి ఆర్టీసీ బస్సు(ఫైల్)

బొంరాస్‌పేట: మహిళా సంఘాలు అంటే ముందుగా గుర్తుకొచ్చేది ఎన్కేపల్లి గ్రామం. 2002కు ముందు గ్రామానికి మట్టి రోడ్డు కూడా లేదు.. అప్పట్లో ఓ ముస్లిం మహిళ చనిపోతే శవాన్ని మంచం మీద మోసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. ఈ ఘటన చూసిన గ్రామ మహిళా సంఘాలు చెలించిపోయాయి. ఆ సమయంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన అధికారులను మహిళా సంఘాల సభ్యులు నిర్బంధించారు. రోడ్డు సౌకర్యం కల్పించేదాకా అధికారులను వదిలిపెట్టేది లేదని తేల్చి చెప్పారు. సాయంత్రం ఆర్డీఓ అనితారాంచంద్రన్ (ప్రస్తుత టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి) గ్రామానికి వచ్చి ప్రజలకు రోడ్డు హామీ ఇచ్చి అధికారులను తీసుకెళ్లారు. అనంతరం గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఏర్పడింది. అప్పట్లో తాము ఉద్యమించడం వల్లే గ్రామానికి రోడ్డు, బస్సు సౌకర్యం వచ్చిందని మహిళా సంఘం అధ్యక్షురాలు బోయిని మాణెమ్మ తెలిపారు.

వైద్య వృత్తిలో..



దోమ: పేద ప్రజలకు వైద్యం అందించాలనే డాక్టర్ వృత్తిని ఎంచుకున్నా. నాన్న గోపాల్, అమ్మ సామ్రాజ్యం. వారికి ముగ్గురు సంతానం. తనను ఉన్నత ఉద్యోగంలో చూడాలన్నదే తల్లిదండ్రుల ఆకాంక్ష. సొంత జిల్లా నల్లగొండలో విద్యాభ్యాసం పూర్తి చేశా. మేడ్చల్‌లోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఉద్యోగం సాధించా. మొదటి దోమ పీఎచ్‌సీకి పోస్టింగ్ ఇవ్వడం సంతోషంగా ఉంది.

చట్టాల గురించి తెలుసుకోవాలి



మహిళలు దేశ అత్యున్నత పదవులను సైతం సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మహిళా ప్రజాప్రతినిధులు భర్తల సాయం లేకుండా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాలి. ఆఫీసులకు స్వేచ్ఛగా, నిర్భయంగా వెళ్లిన నాడే నిజమైన హక్కులు సాధించుకున్నట్లు లెక్క. చట్టాల గురించి తెలుసుకోవాలి. అప్పుడే హక్కులు సాధించుకోగలుగుతారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

– డీబీ శీతల్, న్యాయమూర్తి, వికారాబాద్ కోర్టు

బతుకుదెరువు కోసం వెళ్లి.. ఎస్‌ఐ పోస్టు సాధించి



కుల్కచర్ల: మండలంలోని సక్ర్యానాయక్ తండాకు చెందిన పాత్లావత్ అనూషాది పేద కుటుంబం. బండవెల్కిచర్ల గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి.. షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. తల్లిదండ్రులకు చదివించే స్తోమత లేక మండలంలోని జీతుల తండాకు చెందిన పాత్లావత్ వెంకటేష్‌తో వివాహం చేసి పంపారు. వివాహ అనంతరం కూడా ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. దీంతో బతుకుదెరువు కోసం కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లారు. తమ జీవితాలు బాగుపడాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించింది. ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసింది. 2023 పోలీసు శాఖ రిక్రూట్‌మెంట్‌లో ఎస్‌ఐగా ఎంపికైంది. ప్రస్తుతం నగరంలోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తోంది. కష్టాలకు భయపడకుండా ముందుకు సాగితే విజయం తప్పక వరిస్తుందని నేటి యువతకు సందేశమిస్తోంది.

కుటుంబం నుంచే స్వేచ్ఛ ప్రారంభం కావాలి



మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, స్వేచ్ఛగా వ్యవహరించినప్పుడే నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్లు నా భావన. మహిళలకు స్వేచ్ఛ కుటుంబం నుంచే ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు ఆడపిల్లలను మగపిల్లలను వేర్వేరుగా చూడటం మానేయాలి. ఆడపిల్లలను భారంగా భావించి చిన్నతనంలోనే పెళ్లి చేసి పంపుతున్నారు. ఇది చట్టవిరుద్ధం. బాలికలు బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరాలి. ఆర్థికంగా స్థిరపడాలి.

– జయసుధ, డీపీఓ

ఆరుగురూ ప్రభుత్వ ఉద్యోగులే..



ఆరుగురు అమ్మాయిలతో సూర్యకళ, హన్మయ్య దంపతులు

యాలాల: మండల కేంద్రానికి చెందిన సీహెచ్ హన్మయ్య విశ్రాంత ఉపాధ్యాయుడు. హన్మయ్య, సూర్యకళ దంపతులకు ఆరుగురు కూతుళ్లు. అందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించారు. సమాజంలో మహిళలకు ఎదురయ్యే అవాంతరాలు.. చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తూ పెంచారు. ప్రస్తుతం ఆరుగురూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. సంధ్యారాణి(స్కూల్ అసిస్టెంట్), స్వరూపారాణి(గురుకుల ఉపాధ్యాయురాలు), భార్గవి(పీఆర్ ఏఈ, మహబూబ్‌నగర్ జిల్లా), అర్చన(పంచాయతీ కార్యదర్శి), అశ్విని(ఎస్జీటీ ఉపాధ్యాయురాలు), హారిక ఎస్జీటీ ఉపాధ్యాయురాలుగా స్థిరపడ్డారు.

మహిళల్లో అక్షరాస్యత పెరగాలి



మహిళల్లో అక్షరాస్యతా శాతం పెరగాలి. తమ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఆరోగ్యం కాపాడుకోవాలి. మానసికంగా ధృడంగా ఉండాలి. జిల్లాలో మహిళా అక్షరాస్యత తక్కువే. బాల్య వివాహాలు కూడా ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం ఉంది. వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆడపిల్లలకు స్వేచ్ఛనివ్వాలి. వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రోత్సహించాలి. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.


– రేణుకాదేవి, డీఈఓ

తనకంటూ ఓ పేజీ..





స్వచ్ఛత శక్తి పుస్తకంలో కంతి లక్ష్మిపై వచ్చిన వ్యాసం


దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన కంతి లక్ష్మి గతంలో మహిళా సంఘాల్లో పని చేసేది. భర్త కంతి సైదప్ప. గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేసేవాడు. ప్రమాదంలో సైదప్ప కాలు విరిగిపోవడంతో భార్య లక్ష్మి 2020లో ఆయన విధుల్లో చేరింది. నాటి నుంచే పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలకు తడి పొడి చెత్త గురించి వివరించడం మొదలు పెట్టింది. జనంలో కూడా మార్పు తెచ్చింది. ఆమె సేవలను అధికారులు గుర్తించారు. 2023లో జాతీయ స్థాయి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలుగా ఎంపిక చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. 2024లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన స్వచ్ఛత శక్తి పుస్తకంలో (61వ పేజీలో) చోటు దక్కించుకుంది.











తెలిసిన వారితోనే ఇబ్బంది

- మహిళలపై పలుచోట్ల కొనసాగుతున్న వివక్ష
- బస్టాప్‌లు, కాలేజీల్లో పురుషాధిక్యం
- ఇబ్బంది పెడుతున్న సెల్‌ఫోన్ మెసేజ్‌లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా, వికారాబాద్: సమాజంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షపై రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సాక్షి ప్రత్యేక సర్వే నిర్వహించింది. 15 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలు, 18నుంచి 25 ఏళ్ల వయసున్న యువతులు, 25 నుంచి 35 సంవత్సరాలున్న అతివలు, 35 నుంచి 50 ఏళ్ల వయసున్న వంద మంది మహిళలను (25 మంది చొప్పున) నాలుగు విభాగాలుగా చేసి సర్వే నిర్వహించగా.. వారి నుంచి పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నప్పటికీ పలు చోట్ల వివక్ష కొనసాగుతోందని, స్కూళ్లు, కాలేజీలు, పని ప్రదేశాల్లో ఇతరుల నుంచి కొంత ఇబ్బంది ఎదురవుతోందని, బస్టాప్‌లు, ఆఫీసుల్లో పురుషాధిక్యం ఉందని, సెల్‌ఫోన్లలో వచ్చే మెసేజ్‌లు తమను ఎక్కువగా బాధ పెడుతున్నాయని, వీరిలో తెలియని వారికన్నా తెలిసిన వారే ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నారని సర్వే వెల్లడిస్తోంది.



ప్రెస్‌క్లబ్‌లో సమావేశమైన ఆడపిల్లల సమానత్వ సమాఖ్య జిల్లా సభ్యులు

లింగసమానత్వ సాధనకు..

అనంతగిరి: బాలికలు ఉన్నత విద్యనభ్యసించేందుకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు రాష్ట్ర ఆడపిల్లల సమానత్వ సమాఖ్య పనిచేస్తోంది. ఉన్నత విద్యతోనే లింగసమానత్వం సాధ్యమనే ఉద్దేశంతో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో ఈ సమాఖ్య పోరాడుతోంది. గతేడాది మే లో ఏర్పడిన ఈ సంఘం కన్వీనర్‌గా కృప, జిల్లా కన్వీనర్‌గా జ్యోతి ఉన్నారు. 15 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలు ప్రతినిధులుగా పనిచేస్తున్నారు. ఆరు జిల్లాల్లో ఆక్టివ్‌గా పనిచేస్తోంది. జిల్లా కమిటీలో 30మంది బాలికలున్నారు. బాలికలను విద్యాలక్ష్మిని చేయడమే సంఘం ఆశయం.

క్లుప్తంగా

సామాజిక తనిఖీ బృందానికి సహకరించండి
ఎంపీడీఓ ఉషశ్రీ


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉషశ్రీ

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి శనివారం నుంచి సామాజిక తనిఖీ బృందం పరిశీలిచనుందని.. ఈ పరిశీలనకు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది సహకరించాలని ఎంపీడీఓ ఉషశ్రీ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14వ విడత సామాజిక తనిఖీ బృందం, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో ఏడాదిగా మొత్తం 8,08,22,055లకు సబంధించి నిర్వహించిన పనులకు సామాజిక బృందం పర్యటిస్తూ తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జయపాల్ రెడ్డి, ఎస్‌ఆర్‌పీ జీవన్, ఏపీఓ రాములు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

బషీరాబాద్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు వెలుగు చూశాయి. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక ప్రజావేదికలో ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు బయటపడ్డాయి. ఇందుకు సంబంధించి ఎఫ్‌ఏలు, ఉపాధి అధికారుల నుంచి రూ.2.53 లక్షల నిధులు రికవరీ చేసినట్లు డీఆర్‌డీఓ శ్రీనివాస్ తెలిపారు. అలాగే రూ.41 వేలు జరిమానా విధించామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఓ శారద, తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్
ముగ్గురికి రిమాండ్

శంకర్‌పల్లి: హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు గంజాయికి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మోకిల ఠాణా పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. గురువారం సాయంత్రం ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు మోకిల పోలీసులు శంకర్‌పల్లి మండలం ఇంద్రారెడ్డి నగర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు స్విఫ్ట్ కారులో వెళ్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన రమావత్ మత్రు(35), నేనావత్ తేజ(29), మహారాష్ట్రకు చెందిన నీలేశ్ బాబన్ కాలే(22)ను అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీ చేయగా 52 కిలోల గంజాయి పాకెట్లు లభ్యమయ్యాయి. పోలీసుల విచారణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మోతుగూడెం(ఆంధ్రా–ఒడిశా బార్డర్) నుంచి గంజాయి తీసుకు వచ్చామని.. పెద్ద అంబర్‌పేట ఓఆర్‌ఆర్ వద్దకు చేరుకున్నాక కొంత కారులో.. మిగిలినది సెప్టిక్ ట్యాంక్ వాహనంలో ఉంచి తరలిస్తున్నట్లు వెల్లడించారు. కాగా పోలీసులు సెప్టిక్ ట్యాంకు వాహనం కోసం గాలింపు చేపట్టారు. ముగ్గురు నిందితుల వద్ద 52 కిలోల గంజాయితో పాటు కారు, నాలుగు ఫోన్లు సీజ్ చేశారు. శుక్రవారం నిందితులను చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జైలుకు తరలించారు.

పదేళ్లుగా సాయం


ఆడబిడ్డ వివాహానికి నగదు సాయం అందిస్తున్న మంగశ్రీనివాస్

మంచాల: పేద గిరిజన కుటుంబానికి చెందిన పాతులోత్ మంగశ్రీనివాస్ దంపతులు సాయమంటే ముందుంటారు. మండల పరిధిలోని బండలేమూర్ మాజీ సర్పంచ్ మంగ దంపతులు రాజకీయాలకు రాక మందునుంచే పదేళ్లుగా గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు ఆర్థికసాయం చేసేవారు. అంతటితో ఆగకుండా గ్రామంలో ఏ ఆడ బిడ్డ వివాహం చేసినా నూతన దంపతులకు ఆశీర్వదిస్తూ రూ. పదివేలు ఆర్థికసాయం అందజేస్తున్నారు.

అతివలే అధికారులు

ఆమనగల్లు: సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళలు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నారు. వ్యాపారం, క్రీడా రంగాల్లోనూ తమ ప్రతిభ చాటుతునర్నారు. ప్రజాప్రతినిధులుగా తామేమీ తీసిపోలేదంటూ ప్రజా మన్ననలు పొందుతున్నారు. మండల పరిధిలో ప్రభుత్వ శాఖల అధికారులంతా మహిళలే. ఆమనగల్లు ప్రథమశ్రేణి న్యాయమూర్తిగా కాటం స్వరూప, ఎంపీడీఓగా కుసుమ మాధురి, తహసీల్దార్‌గా లలిత, వ్యవసాయ శాఖ ఏడీగా శోభా రాణి విధులు నిర్వహిస్తున్నారు.


లలిత, తహసీల్దార్


స్వరూప, న్యాయమూర్తి


కుసుమమాధురి, ఎంపీడీఓ


శోభారాణి, ఏడీఏ

ఆడ బిడ్డ జన్మిస్తే రూ.5 వేలు.. వివాహానికి రూ.10 వేలు


చిన్నతూప్రలో ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్

మహేశ్వరం: తల్లిదండ్రులే లింగ భేదం చూపుతున్న సమాజంలో ఆడబిడ్డలున్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నాడు. వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తూ పలువురికి ఆదర్శంగా ఉంటున్నాడు చిన్నతూప్ర మాజీ సర్పంచ్ కొండా రఘుపతిగౌడ్. మూడేళ్లుగా గ్రామంలో ఆడబిడ్డకు జన్మనిస్తే రూ.5వేలు, వివాహానికి రూ.10 వేలు సాయం అందజేస్తున్నాడు. భవిష్యత్‌లోనూ సాయం అందజేయడం ఆపేది లేదంటున్నాడు.

ఆడపిల్ల అంటే ధైర్యం


ఆడపిల్లలను భారంగా కాకుండా ధైర్యంగా భావించాలి. ప్రస్తుతం అన్ని రంగాల్లో అతివలే పై స్థాయిలో ఉన్నారు. సహనం కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలి. భర్తకు తోడుగా నిలుస్తూ పిల్లలను ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహించాలి. లింగభేదం లేకుండా చదివించాలి.

– షేక్ ముంతాజ్, తహసీల్దార్, కడ్తాల్

మహిళలను ప్రోత్సహించాలి


మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలి. ప్రజాప్రతినిధులుగా మహిళలు ఉన్నప్పటికీ వారి భర్తలే పెత్తనం చెలాయించడం సరికాదు. వారు వేదికలపై మాట్లాడేలా భర్తలు అవగాహన కల్పించి ప్రోత్సహించాలి. ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్య కల్పించాలి.

– రాజేశ్వరి, ఏపీఎం, కడ్తాల్.

సమానత్వ సమాజం నిర్మిద్దాం


మహిళా దినోత్సవం అనేది మహిళల శక్తిని, సహనాన్ని విజయాలను గౌరవించే ప్రత్యేకమైన రోజు. సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని గుర్తు చేసే రోజు. సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారు. మహిళలందరికి అవకాశాలు, గౌరవం, సమానత్వం కలిగిన సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలి.

– సుజాత, ఎంపీడీఓ, కడ్తాల్

గొప్పశక్తిగా మహిళ


ఒకప్పుడు పూర్తిగా ఇంటికే పరిమితమైన మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఒకవైపు కుటుంబ బాధ్యతను.. మరోవైపు అధికారిక కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఉన్నత చదువులు చదువుకుంటూ.. ఉన్నతంగా రాణిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా గొప్ప శక్తిగా ఎదుగుతున్నారు

– ప్రతిమాసింగ్, అదనపు కలెక్టర్

చిన్నచూపు వద్దు


మాది పూర్వ నల్లగొండజిల్లా హుజూర్‌నగర్. నాన్నకు నలుగురం సంతానం. పేద, మధ్య తరగతి కుటుంబం. ముగ్గురు అమ్మాయిలే అయినామా నాన్న మమ్మల్ని చదువు విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదు. కష్టపడి చదివించారు. ఎకనామిక్స్‌లో పీజీ, బీఈడీ పూర్తి చేసి, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాను. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా డైరెక్ట్ సెలక్షన్ ద్వారా వచ్చాను. మిర్యాలగూడలో తొలి పోస్టింగ్ వచ్చింది. ఆ తర్వాత ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డిలో ఏడీ చైల్డ్ వెల్ఫేర్‌గా పని చేశాను. ఆ తర్వాత ఇక్కడికి బదిలీపై వచ్చా.

– సంధ్యారాణి, స్త్రీ, శిశు సంక్షేమ సంఘం అధికారి

ఆత్మ విశ్వాసమే ఆయుధం


మహిళలకు ఆత్మ విశ్వాసాన్ని మించిన ఆయుధం లేదు. లింగబేధం లేకుండా పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి. మహిళలు రాణించేందుకు ప్రభుత్వం మరింత సహకారం అందించాలి.

– శ్రీలత, మండల వ్యవసాయ అధికారి

గౌరవ భావం పెరగాలి


సమాజానికి మహిళలు పట్టుకొమ్మలు. ఇంటి నిర్మాణంతో పాటు, సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది. మహిళలు రాణించలేని రంగం ఏది లేదూ. మహిళల పట్ల సమాజంలో మరింత గౌరవ భావం పెరగాలి.

– అనిత, ఎస్ఓ, కేజీబీవీ, కడ్తాల్

స్వతంత్రంగా ఆలోచించాలి


మహిళలు స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటేనే అభివృద్ధి. ఆర్థిక స్వాతంత్ర్యం, విద్యతోనే మహిళలు ఏ రంగంలోనైన రాణించేందుకు అవకాశం ఉంటుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తేనే విజయం సొంతమవుతుంది. మనలోని ప్రతిభను గుర్తిస్తే లక్ష్యసాధన సులువు అవుతుంది.

– స్నేహలత, ఈఓ, మైసిగండి ఆలయం

తాండూరు నుంచే బీసీ ఉద్యమం


ఆర్.కృష్ణయ్యతో బీసీ సంఘం తాండూరు నాయకులు

- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్

తాండూరు టౌన్: యాభై ఏళ్ల క్రితం తాండూరు నుంచే బీసీ ఉద్యమం ప్రారంభమైందని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను సంఘం తాండూరు శ్రేణులు, బీసీ మహిళా సంఘం నాయకులు నగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ హక్కుల సాధనకు పోరాడుతూనే విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. త్వరలో ఢిల్లీ స్థాయిలో నిర్వహించనున ఉద్యమానికి బీసీలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సయ్యద్ షుకూర్, బీసీ మహిళా సంఘం నాయకులు మధులత, అనిత, మంజుల, నర్సమ్మ, జగదీశ్వరి, నాయకులు లక్ష్మణాచారి, శ్రీనివాస్, అరుణ్‌రాజ్, విజయ్, ఫయాజ్, రాములు తదితరులు ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై అవగాహన కల్పించండి
- గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయడంలో వేగం పెంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మార్చి 15 వరకు మిషన్ భగీరథ, గ్రిడ్ ఇంట్రా పనులకు గ్రౌండింగ్ చేపట్టి 20 వరకు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరకాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఎప్పటికప్పుడు పరిశీలించి గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామాణాభివృద్ధి అధికారి శ్రీలత, పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

కేశంపేట: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సంఘం నాయకులతో కలిసి పంచాయతీ రాజ్ డిప్యూటీ డైరెక్టర్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన రామారావు వచ్చే బడ్జెట్ నుంచి గ్రీన్ చానల్ ద్వారా ప్రతీ నెల 1న వేతనాలు అందేలా చూస్తామన్నారు. టీఎస్‌బీఎస్ ద్వారా ఫిబ్రవరి వరకు ఉన్న వేతనాలను మంగళవారం వరకు చెల్లిస్తామన్నారు జనరల్ ఫండ్స్‌లో జనరేట్ చేసిన వేతనాల చెక్కులను క్లియర్ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్యం, మల్లయ్య, జిల్లా నాయకులు రాంచంద్రయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ వర్కర్స్ యూనియన్ సభ్యులు

మహిళలను ప్రోత్సహిస్తే.. ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు

- ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిని గుత్తా జ్వాల
- కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

అనంతగిరి: మహిళలను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిని, అర్జున అవార్డు గ్రహీత గుత్తా జ్వాల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో టీజీఓ జిల్లా కమిటీ, మహిళా శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించడంతోపాటు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా చిన్ననాటి నుంచి ఆడపిల్లలను ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. నా జీవితంలో మొదటి గురువు తన తల్లి అన్నారు. మహిళలను సమాన దృష్టితో చూడాలన్నారు. మగవారి విజయం వెనుక మహిళల సహకారం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగంలో మహిళా ఉద్యోగులు వారికి అప్పజెప్పిన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. విధుల పట్ల వారికున్న అంకితభావానికి గర్విస్తున్నానని పేర్కొన్నారు. బొంరాస్‌పేట ఆశ్రమ పాఠశాల మహిళా ఉపాధ్యాయులు చేసిన బంజార నృత్యం, భరత నాట్యం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీపీఓ జయసుధ, డీపీఆర్ఓ చెన్నమ్మ, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మహిళా ఉద్యోగులతో కలెక్టర్ తదితరులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గుత్తా జ్వాల


తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి
అనిసంతకం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

రక్తదాన శిబిరం

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి, వైస్ చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టరేట్, డీపీఆర్ఓ ఉద్యోగులు రక్తదానం చేశారు.

క్రీడా పోటీలు

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా క్రీడాకారులకు, కలెక్టరేట్, మున్సిపల్, రెవెన్యూ, విద్య, వైద్య, పోలీస్ మహిళా సిబ్బంది, అంగన్‌వాడీ, మహిళా సంఘాల సభ్యులకు బహుమతులు అందజేశారు. కలెక్టరేట్‌లో రంగోలి, మ్యూజికల్ చైర్, చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

రేపు ఇండియాకు ప్రవీణ్ మృతదేహం

కేశంపేట: అమెరికాలో మృతిచెందిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతదేహం ఆదివారం ఇండియాకు రానుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న అనంతరం అతని స్వగ్రామం కేశంపేటకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ప్రవీణ్ తల్లిదండ్రులు గంప రాఘవులు, రామాదేవి దంపతులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య వేర్వేరుగా పరామర్శించారు. బాబయ్య ఫోన్‌ద్వారా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ మృతుడి తండ్రిని పరామర్శించారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళలే అని అన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర చాలా గొప్పదన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పని చేస్తోందన్నారు. షీటీం ఆకతాయిలపై కొరడా ఝులిపిస్తోందని తెలిపారు. మహిళల భద్రత కోసం పటిష్టమైన చట్టాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలను చైతన్యం చేయడం ద్వారానే హత్యలు, అత్యాచారాలు తగ్గుముఖం పడతాయన్నారు. కార్యక్రమంలో గురునానక్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ హెచ్‌ఎస్ సైనీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.